క్లుప్తంగా

కొబ్బరి, మామిడి ఫలసాయం వేలం

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప శివారు నాగులాపల్లి ఏరియా రక్షిత తాగునీటి ప్రాజెక్ట్ పరిధిలోని కొబ్బరి, మామిడి ఫలసాయం వేలం పాటను నాగులాపల్లి పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. జెడ్పీ కార్యాలయ రెవెన్యూ అధికారి శాస్త్రి వేలం నిర్వహించారు. 2023–24 సంవత్సరాలకు ప్రాజెక్టు పరిధిలో 22 కొబ్బరి చెట్లు, 8 మామిడి చెట్లను వాకతిప్పకు చెందిన దాకే ఆశీర్వాదం జీఎస్టీతో కలిపి రూ.47,200కు పాడుకున్నారని తెలిపారు. రెండేళ్ల పాటు ప్రాజెక్ట్‌లో ఉన్న మొక్కలను నరకడం, కలపను తరలించడం, ఎటువంటి పురుగు మందును పిచికారి చేయకూడదన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం


రాజబాబు కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని ఎండపల్లి శివారు జొన్నల గరువురుకు చెందిన కొంగు రాజబాబు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా తన కుటుంబాన్ని గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. సర్పంచి శీలం పెద అప్పారావు, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఉప సర్పంచి గుండ్ర చిన్నారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు ఉన్నారు.

22న రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికలు

సామర్లకోట: ఈనెల 25 నుంచి 27 వరకు పూర్వపు విశాఖ జిల్లా అనకాపల్లి వద్ద అంకంపాలెం గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 70వ అంతర్ జిల్లాల పురుషులు, మహిళల కబడ్డీ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేయడానికి కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాల ఇండోర్ కబడ్డీ కోర్టులో 22వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వారి వారి ఆధార్ కార్డులతో కాకినాడ పీఆర్ కళాశాలకు హాజరు కావాలన్నారు. క్రీడాకారుల మధ్య పోటీ నిర్వహించి ఉమ్మడి జిల్లా టీములను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడకుంటే ఉద్యమం

పిఠాపురం: పిఠాపురం అగ్రహారంలో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాచేసి విక్రయిస్తున్నారని దానిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ హెచ్చరించారు. గురువారం పిఠాపురం నందూరి ప్రసాదరావు భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రహారంలో ప్రభుత్వ భూమిని కొందరు బహిరంగంగా విక్రయించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఆటోను ఢీకొన్న బైక్ : ముగ్గురికి గాయాలు


ప్రమాదస్థలంలో పడిన ఆటో మోటారు సైకిల్


గాయపడిన యువకులు

పిఠాపురం: డ్రైవరు టీ తాగడానికి ఒక హోటల్ వద్ద ఆపిన ఆటోను మోటారు సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు అతి వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఆటో పల్టీలు కొట్టగా ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. పిఠాపురం శివారు వై.జంక్షన్ వద్ద ఉన్న ఒక హోటల్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. పిఠాపురం నుంచి గొల్లప్రోలు వెళ్తున్న మోటారు సైకిల్‌పై గొల్లప్రోలుకు చెందిన మణికంఠతో పాటు మరో ఇద్దరు యువకులకు గాయాలవగా వారిని హైవే పెట్రోలింగ్ పోలీసులు ప్రైవేటు వాహనాల్లో కాకినాడ ప్రైవేటు ఆస్పత్రుల్లో చేర్చారు. ఎస్సై జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టైరుకు పంక్చర్‌తో రోడ్డుకు అడ్డంగా లారీ


ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు 216 జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఒక లారీ టైరు మరమ్మతుకు గురి కావడంతో ఒక్క సారిగా రోడ్డుకు అడ్డంగా తిరగడంతో పెను ప్రమాదం తప్పింది. గొల్లప్రోలు బైపాస్ రోడ్డు పిఠాపురం నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న లారీ రోడ్డు అడ్డంగా ఉండి పోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి పరిపాలన

22వ వార్డు గడప గడపకూలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు


సామర్లకోటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రజా సంకల్పయాత్ర, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం 11 సచివాలయం పరిధిలో 22వ వార్డులో గడపగడపకూ ఆ వార్డు కౌన్సిలర్ పితాని కృష్ణ, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాల శ్రీను, మసకపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్లలోనే 98 శాతం హామీలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గతంలో అధికారం కోసం హామీ ఇచ్చిన చెత్త బుట్టలో పడేశారని ఆయన గుర్తు చేశారు. నేడు పేద వారి పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతమైన విద్యను అందించడానికి సీబీఎస్ఈ విధానం అమలు చేస్తున్నారని తెలిపారు. చదువుతోనే ప్రగతి సాధ్యమనే విషయాన్ని గమనించిన ముఖ్యమంత్రి చదువు ఉచితంగా అందించాలని నిర్ణయించారన్నారు. గడప గడపకూలో గుర్తించిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. అర్హత ఉండి పథకాలు రాని వారు తిరిగి సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి ప్రతిరోజూ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, మంత్రి శేషారావు, పిట్టా సత్యనారాయణ, స్వయంభూరపు వీరభద్రరావు, గుబ్బల సత్యనారాయణ,, నేతల హరిబాబు, అచ్చంపేట సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నానీ, గొంచాల ఎంపీటీసీ సభ్యుడు పేర్నిడి రాయుడు, హుస్సేన్‌పురం ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్ పార్టీ నాయకులు వారా సుధాకర్ మసకపల్లి సత్యనారాయణ, మాగాపు గోపి, టౌన్ ప్లానింగ్ అధికారి ఫణికుమార్, ఆర్ఓ పూడి రవిబాబు, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ


ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని లబ్ధిదారును అడుగుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక ఐదో వార్డు సచివాలయ పరిధిలోని మిరపకాయల వీధిలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందుతున్న పథకాలను చదివి వినిపించి అవన్నీ అందుతున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనల సందర్భంగా వస్తున్న విజ్ఞప్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే గడప గడపకూ కార్యక్రమం పూర్తయిన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఆయన తెలిపారు. పట్టణంలో డ్రైన్ల సమస్య తీవ్రంగా ఉందని, అన్ని వార్డుల నుంచి వినతులు వస్తున్నాయన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి సచివాలయాలకు కేటాయించే నిధులతో పాటు పట్టణ అభివృద్ధికి సీఎం జగన్ కేటాయించిన రూ.20 కోట్లతో పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు , వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్త అంత్యక్రియల్లో దొరబాబు


నాగేశ్వరరావు అంత్యక్రియల్లో పాల్గొన్న దవులూరి దొరబాబు

సామర్లకోట: మండల పరిధిలోని గొంచాల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త మోర్త నాగేశ్వరరావు అంత్యక్రియల్లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు గురువారం పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నాగేశ్వ రరావు బుధవారం రాత్రి మరణించారు. దాంతో ఆ గ్రామంలో గురువారం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, అభిమానులు అంతిమ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో పాల్గొన్న.నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను దొరబాబు పరామర్శించి సంతాపం తెలిపారు. పార్టీ అభివృద్ధికి నాగేశ్వరరావు విశేష కృషి చేశారని నివాళులర్పించారు. నాగేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నూరుశాతం బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

ఆర్డీఓ జేఎస్ రామారావు


బాల్య వివాహాల సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: డివిజన్ పరిధిలో జరుగుతున్న బాల్య వివాహాలను నూరు శాతం నిర్మూలించేందుకు అధికార యంత్రాంగం పని చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం సాయంత్రం డివిజన్ స్థాయిలో ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య, ఆయా శాఖల సిబ్బందితో బాల్య వివాహాల నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బాల్య వివాహాలు 29 శాతం ఉంటే డివిజన్‌లో 15 శాతం ఉందని, నూరుశాతం బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బాల్య వివాహాలు జరిపినా, వాటిని ప్రోత్సహించిన వారిపై పోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోక తప్పదని ఆర్డీఓ జేఎస్ రామారావు హెచ్చరించారు. రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ మెంబర్ పి.ఆదిలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్.వెంకట్రావు మాట్లాడుతూ బాలల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలలు శారీరక, మానసిక, ఆరోగ్యపరంగా వేధింపులకు గురవుతున్నారని, బాలల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన, అధికారుల విధులపై వెంకట్రావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం పీఓ బి.రామకోటి, సీడీపీఓ ఉషా, ఎల్‌సీపీఓ ఎం.సుధాకర్, చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

హైవేపై వానరశ్రేణి..


హైవే దాటుతున్న వానర సేన

పిఠాపురం: నిత్యం వందల వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే 216 జాతీయ రహదారిపై వానర దండు ప్రత్యక్షమైంది. ఒక్కసారిగా వందకు పైగా కోతుల గుంపు రోడ్డుపైకి రావడంతో వాటికి దారివ్వక తప్పలేదు నర, వాహనాదులకు. గొల్లప్రోలు 216 జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద గురువారం వానరాల గుంపు సుమారు పావుగంట పాటు ఇలా రోడ్డుపైనే తిష్ట వేసింది. దీంతో వాహనచోదకులు వారి సెల్ ఫోన్లకు పని చెప్పారు. కొద్ది సేపటికి వానరాలు సమీపంలోని చేలలోకి వెళ్లిపోగా వాహన చోదకులు ముందుకు కదిలారు.

వేమన ఆశయాలు అనుసరణీయం

మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్


వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్


గొల్లప్రోలు నగర పంచాయతీలో వేమనకు నివాళులర్పిస్తున్న అధికారులు

పెద్దాపురం: ప్రజాకవి, సంఘ సంస్కర్త యోగి వేమన ఆశయాలు అనుసరణీయమని పెద్దాపురం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వేమన జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అధ్యక్షతన జరిగిన జయంతి సభలో వారు మాట్లాడుతూ యోగి వేమన సేవలను కొనియాడారు. తొలుత యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ ఉమామహేశ్వరరావు, ఆర్ఓ చంద్రశేఖర్, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, తలారి ధర్మేంద్ర, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఆయా విభాగాల మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి

పిఠాపురం: యోగి వేమన జయంతిని నియోజకవర్గంలో గురువారం నిర్వహించారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో కమిషనర్ ఎం.సత్యనారాయణ, కౌన్సిలర్ గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి తదితరులు యోగి వేమన చిత్ర పటానికి పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ రాంప్రసాద్, జేఏఓ పద్మజ్యోతి, టీపీఓ వల్లీప్రియ తదితరులు పాల్గొన్నారు. పిఠాపురం మున్సిపాలిటీలో డీఈ భవానిశంకరుడు, మేనేజర్ జయరాం, టీపీఓ శ్రీనివాస్ ఏఎస్ఓ వర్మ తదితరులు పాల్గొని యోగి వేమన చిత్ర పటానికి నివాళులర్పించారు.

వేమన గురించి తెలుసుకోవాలి

సామర్లకోట: యోగి వేమన గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్ని నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో యోగి వేమన జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ నివాళులర్పించారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్ స్వయంభూరపు వీరభద్రరావు, మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

- గత సంప్రదాయాలను గౌరవించాలి
- మహాశివరాత్రి ఏర్పాట్ల సమావేశంలో భక్తులు


పంచారామ క్షేత్రంలో భక్తుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ నాగమల్లేశ్వరరావు

సామర్లకోట: మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడు స్వామి, అమ్మవార్లను దర్శించుకునే విధంగా మెరుగైన ఏర్పాట్లు చేయాలని భక్తులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఈఓ డి.నాగేమల్లేశ్వరరావు అధ్యక్షతన మహాశివ రాత్రి ఏర్పాట్లపై భక్తులతో సమావేశం జరిగింది. మహాశివ రాత్రిలో భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి దేవదాయ శాఖ సిద్ధంగా ఉందని ఈఓ తెలిపారు. ఈ మేరకు భక్తులు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. గతంలో ఉన్న సంప్రదాయాలను గౌరవించాలని భక్త సంఘం నాయకుడు బిక్కిన సత్యసాయిపరమేశ్వరరావు అన్నారు. ఆలయంలో తొలి పూజకు వచ్చే భక్తులందరికి హారతి ఇవ్వాలని ట్రస్టు బోర్డు సభ్యులు చందలాడ వెంకట్రావు, యండమూరి వెంకటసుబ్బారావు, బీవీ రమణ డిమాండ్ చేశారు. ఆలయ కోనేరును స్వచ్ఛమైన నీటితో నింపాలన్నారు. కోనేరులో జిగురు మట్టిని తీసి వేసి ఇసుక వేయాలని బీజేపీ నాయకులు సుంకవిల్లి బాపిరాజు, వల్లూరి బుల్లియ్యలు డిమాండ్ చేశారు. ఆలయంలోని అర్చకులు స్థానిక భక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆలయ సమీపంలో కోళ్లపారం ఏర్పాటు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, విశ్రాంతి భవనం నిర్మాణానికి మాత్రం నిబంధనలు పెడుతున్నారని మానవ హక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆరోపించారు. టూరిజం శాఖ నిధుల కొరత కారణంగానే విశ్రాంతి భవన నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని ఈఓ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మహాశివ రాత్రి సందర్భంగా గతేడాది సంబరం మధ్యలో బ్యాండ్ నిర్వాహకులు వెళ్లిపోయారని కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్ ఆరోపించారు. శివరాత్రి ఏర్పాట్లు నాణ్యతగా ఉండాలన్నారు. ఈ మేరకు చలువ పందిళ్లు, పూల అలంకరణ, బ్యాండ్, లైటింగ్, స్వామి వారి ఊరేగింపు, వీధి దీపాలు, రథ సంబరానికి సంబంధించిన ఖర్చులకు సమావేశం ఆమోదించింది. ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి భీమన్న పాల్గొన్నారు.

పెద్దాపురంలో నేడు ఉరుసు గంధోత్సవం

పెద్దాపురం: సుమారు 354 ఏళ్ల చరిత్ర కల్గిన పట్టణ శివారులోని హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా(తొమ్మిది మూరల సాహెబ్) మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉరుసు గంధోత్సవాన్ని 20వ తేదీ నుంచి 22 వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్టు దర్గా కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. గంధోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ముస్లింలు, అంజుమన్ వ్యవస్థాపకుడు దివంగత ఎంఏ సత్తార్ ఇంటి వద్ద నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు దర్గా సభ్యులు ఎండీ లాయక్ అలీ, బాబూలాల్, ఆషిక్ అలీ, రఫీ, సబ్బీర్, జలీల్, బాజీ, రిజ్వాల్, ఇర్షాద్ అలీ, హఫీజ్, జాకీర్‌ల ఆధ్వర్యంలో గంధం ఊరేగింపు మేళాతాళాలతో బయల్దేరి దర్గాకు చేరుకుంటుంది. ఈ ఉత్సవాన్ని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు తదితరులు ప్రారంభిస్తారన్నారు.

దళారులు లేకుండా ధాన్యం కొనుగోలు

- రూ.రెండు లక్షల మిగులుతో అంచనా బడ్జెట్
- జగనన్న కాలనీలకు రోడ్ల నిర్మాణం చేయాలి
- మండల సమావేశంలో ఎంపీపీ సత్తిబాబు డిమాండ్


మండల సమావేశంలో హౌసింగ్ ఏఈని ప్రశ్నిస్తున్న ఎంపీపీ సత్తిబాబు

సామర్లకోట: గ్రామాల్లోనే రైతులు ధాన్యం విక్రయించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎంతో మేలు చేస్తోందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ పథకాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయాలు చేసుకోవడంతో దళారుల బెడద లేకుండా పోయిందన్నారు. పీబీ దేవం ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు మాట్లాడుతూ మిల్లరు రైతు భరోసా కేంద్రంలో తీసిన తేమ శాతం కంటే ఎక్కువ శాతం చూపుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మిల్లుల తూకంలోనూ మోసాలు జరుగుతున్నాయని, తరచూ తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేసేలా మండల సమావేశంలో తీర్మానం చేయాలన్నారు. దానికి ఎంపీపీ అంగీకరించారు. వీకే రాయపురంలోని పంట కాలువలో పూడిక తీయక పోవడం వల్ల ఏటా 350 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు శివకోటి శివరామకృష్ణ ఆరోపించారు. లోపాలను సవరిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. జగనన్న కాలనీలకు రోడ్లు నిర్మాణం చేయాల్సి ఉండగా హౌసింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు జగనన్న కాలనీలో మంజూరైన ఇళ్ల వివరాలు తెలియజేశారు. ఏఓ సత్య మాట్లాడుతూ డ్రోన్ల వినియోగంపై ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇస్తామన్నారు. రైతులకు ఎరువుల కొరత లేదని చెప్పారు. మండల పరిధిలోని ఆయా శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఎంఎస్ఓ శ్రీరమణి, మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య పాల్గొని వివరాలు తెలిపారు.

2023–2024లో రూ. రెండు లక్షలు మిగులు..

2023–2024 ఆర్థిక సంవత్సరంలో రెండు లక్షల మిగులుతో అంచనా బడ్జెట్‌ను మండల సమావేశంలో ఆమోదించారు. ఆ సంవత్సరంలో ఆదాయం రూ.69,32,21,000, ఖర్చులు రూ.69,30,21,000 చూపుతూ అంచనా బడ్జెట్‌ను తయారు చేశారు. బడ్జెట్‌ను ఎంపీడీఓ డి శ్రీలలిత ప్రవేశ పెట్టగా సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. మండల పరిపాలనాధికారి వీవీ సాయిబాబు, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే పెండెం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. గురువారం ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని సిబ్బంది అడిగిన మెటీరియల్‌లో ఐదు వీల్ చైర్స్, ఒక ప్రింటర్, రెండు బీరువాలు, ఆక్సిజన్ యూనిట్లను రూ.50 వేల సొంత ఖర్చుతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. రూ.2 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చిన స్థానిక దాతలు గుత్తుర్తి విజయేంద్ర, మురళీకృష్ణలను దుస్సాలువాతో సత్కరించారు. కమిటీ సభ్యులు పెదపాటి రమేష్, బొజ్జా దొరబాబు, వైద్యులు కీర్తి, శ్రీనివాస్, మోమినా, విక్టోరియా, సత్యనారాయణ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఆస్పత్రికి ఒక కంప్యూటర్, రక్త నిల్వ యూనిట్‌కు ఏసీ అవసరం ఉంటుందని దానికి ఎవరైనా దాతలు సహకరించాలని ఈ సందర్భంగా వైద్యులు కోరారు.

మూడు లైన్లలోనే జీవిత సారాన్ని అందించిన వేమన


సామర్లకోటలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సామర్లకోట: యోగి వేమన కేవలం మూడు లైన్లలో విలువైన జీవిత అనుభవసారాన్ని, నైతిక విలువలను తన పద్యాల ద్వారా సమాజానికి అందించారని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో వేమన జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ మేరకు విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహు మతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శ్రీలక్ష్మి, బి.బేబి రాణి, టి.వైకుంఠం, జి.గోవిందు, కె.అరుణ, కేవీవీ సత్యనారాయణ, ఏఎల్‌వీ కుమారి, శ్రీవల్లీ పాల్గొన్నారు.

ఎంపీడీఓ రామారావుకు నివాళి


ఎంపీడీఓ రామారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం


కొత్తపల్లి: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఇన్‌చార్జి ఎంపీడీఓ నండూరి ప్రభాకర రామారావుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, నాయకులు నివాళులు అర్పించారు. మండల పరిషత్ ద్వారా జరిగే అభివృద్ధికి ఎంతోగానో కృషి చేసిన రామారావు మృతి తీరని లోటని పలువురు కొనియాడారు. ఎంపీపీ కారే సుధ, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, ఈఓ పీఆర్డీ భాస్కర రావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.


ప్రమాదకర ప్రదేశాల్లో వేగ నిరోధకాలు


పోలవరం గట్టు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

పిఠాపురం: ఇటీవల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న గొల్లప్రోలు మండలం జాతీయ రహదారి వన్నెపూడి, చెందుర్తి పోలవరం కాలువ గట్టు ప్రాంతాల్లో పోలీసులు వేగ నిరోధక చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు గురువారం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు గొల్లప్రోలు మండలం చెందుర్తి, వన్నెపూడి, కొడవలి జాతీయ రహదారి రోడ్డు క్రాసింగ్‌ల వద్ద స్పీడు బ్రేకర్ల నిర్మాణానికి చర్యలు తీసుకుని, హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతు రోడ్డు క్రాసింగ్‌లు ఉన్న చోట వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మెయిన్ రోడ్డు దాటే టప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తుల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆయన వెంట ఎస్సై వినయ్ ప్రతాప్ ఉన్నారు.

అంబరానికి.. అంబుధికి.. ఉషోదయం..





అంబరానికి బాల భానుడే ఒక అందం. ఆ అంబరం.. భానుడూ అంబుధిపై ఉంటే.. ఆ ప్రతిబింబ సౌందర్యాన్ని వర్ణించడానికి ఎంత మంది కవులు క్యూ కట్టారో ఇంత వరకు. ఎవరి ఊహా ప్రపంచం వారిది. సింధుర వర్ణంలో నుదుటిన కుంకుమలా వీక్షకులను ఆకర్షిస్తున్న అంబరాన్ని, అంబుధిని చూసి ఆస్వాదించాల్సిందే. పొట్టకూటికి చేపల వేట చేస్తున్న మత్స్యకారుడి పడవ మరో పార్శ్వాన్ని స్పృశిస్తోంది. అదే సమయంలో గగనమంతా నాదే అంటూ వైమానిక దళం హెలికాప్టర్ సందడి చేస్తోంది. ఉప్పాడ సాగర తీరంలో గురువారం త్రివిధ దళాల విన్యాసాల వేళ కనువిందు చేసిన దృశ్యాలివి.

– పిఠాపురం